

**కేటీఆర్‌కు కలిసిన మాజీ ఎమ్మెల్యేలు**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను నల్లగొండ జిల్లా మాజీ ఎమెల్యేలు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వారిలో రమావత్ రవీంద్రకుమార్, నల్లమోతు భాస్కర్‌రావు, కంచర్ల భూపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


నమస్తే తెలంగాణ

# నల్లగొండ

5 నల్లగొండ, గురువారం 7 నవంబర్ 2024 NALGONDA




కౌశిక్‌దాస్‌ను అభినందిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

# సమగ్ర కుటుంబ సర్వే షురూ

## ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎన్యుమరేటర్లతో సర్వే
## తొలి రోజు ఇండ్లను గుర్తించి స్టిక్కర్ వేసిన బృందాలు
## క్షేత్రస్థాయిలో తనిఖీ చేసిన కలెక్టర్లు
## ఈ నెల 9 నుంచి 75కాలమ్స్‌లో వివరాల సేకరణ



నల్లగొండలోని బీటీఎస్‌లో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, నవంబర్ 6 : ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లావాప్తంగా బుధవారం సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభమైంది. నల్లగొండ జిల్లావ్యాప్తంగా 844 గ్రామ పంచాయతీలు, 8 మున్సిపాలిటీల్లో 3,483 మంది ఎన్యుమరేటర్లు సర్వేలో భాగస్వాములయ్యారు. సూర్యాపేట జిల్లాలో 23 మండలాలు, 5 మున్సిపాలిటీల్లో 2,601 మంది ఎన్యుమరేటర్లు, యాదాద్రి భువనగిరి జిల్లాలో 1,938 ఎన్యుమరేటర్లు విధుల్లో పాల్గొన్నారు. వారిని మండల స్థాయిలో ఎంపీడీఓలు, మున్సిపాలిటీల్లో మున్సిపల్ కమిషనర్లు, జిల్లా స్థాయిలో నోడల్ ఆఫీసర్ పర్యవేక్షిస్తున్నారు. తొలి రోజు అంతటా ఇండ్లను గుర్తించి స్టిక్కర్లు వేశారు. ఈ నెల 8వరకు ఈ ప్రక్రియ కొనసాగనుంది. 9 నుంచి గుర్తించిన ఇండ్లల్లో సర్వే చేస్తారు. ఇప్పటికే ఆయా గ్రామాలు, మున్సిపాలిటీల్లో సర్వే విషయంపై తాంతాం వేయించిన అధికార యంత్రాంగం ప్రభుత్వం ఇచ్చిన ఫామ్‌లోని 75కాలమ్స్‌లో వివరాలను నమోదు చేయనున్నది. వలిగొండ



16వ వార్డులో సర్వేను తనిఖీ చేసిన కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్

మండల కేంద్రంలోని సాయినగర్‌లో ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, యాదగిరిగుట్ట పట్టణంలోని బీసీ కాలనీలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య సర్వే స్టిక్కరింగ్‌ను ప్రారంభించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని బీటీఎస్‌తోపాటు మునుగోడు మండలం గూడపూర్, చండూర్ మున్సిపాలిటీలో కలెక్టర్ ఇలా త్రిపాఠి సర్వేను తనిఖీ చేశారు. సూర్యాపేట కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ జిల్లాకేంద్రంలోని 16వ వార్డు వంద ఫీట్ల రోడ్డులో సర్వేను పరిశీలించారు. భువనగిరి మండలం వడాయిగూడెంలో అదనపు కలెక్టర్ గంగాధర్ సర్వే స్టిక్కరింగ్ ప్రక్రియను తనిఖీ చేశారు. తొలుత కుల గణన అన్న ప్రభుత్వం ఆ తర్వాత సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే చేస్తామని చెప్పిన నేపథ్యంలో ఇంటి యజమానులు ఆధార్, రేషన్ కార్డులు, పట్టాదారు పాస్‌పుస్తకాలు అందుబాటులో ఉంచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# పర్యావరణ పరిరక్షుడికి మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రోత్సాహకం

సూర్యాపేట టౌన్, నవంబర్ 6 : సైకిల్ యాత్ర ద్వారా దేశమంతా తిరిగి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్న పశ్చిమ బెంగాల్ యువకుడు కౌశిక్‌దాస్‌కు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అభినందనలు తెలిపారు. కౌశిక్‌దాస్ సైకిల్ యాత్ర బుధవారం రాత్రి సూర్యాపేట జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్లను మర్యాదపూర్వకంగా కలిసి, యాత్ర విశేషాలను వివరించారు. కౌశిక్‌దాస్‌కు భోజనంతోపాటు వసతి కల్పించిన జగదీశ్‌రెడ్డి ఆయన యాత్ర ఖర్చులకు ఆర్థిక సాయం చేశారు. కౌశిక్‌దాస్ మాట్లాడుతూ అక్టోబర్ 20న పశ్చిమ బెంగాల్‌లోని కళ్యాణి నుంచి సైకిల్ యాత్ర ప్రారంభించినట్లు తెలిపారు. సూర్యాపేటలో సుందరీకరణ, పచ్చదనం బాగుందని పేర్కొన్నారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



ఎడమ కాల్వ జలవిద్యుత్ కేంద్రంలో కేక్‌ను కట్ చేస్తున్న సీఈ మంగేశ్ కుమార్

# లక్ష్యం చేరిన విద్యుత్ ఉత్పత్తి

నందికొండ, నవంబర్ 6 : నాగార్జునసాగర్ ఎడమ కాల్వ జల విద్యుత్ కేంద్రంలో 2024-25 సంవత్సరానికి గానూ నిర్ణయించిన టార్గెట్ 69 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తిని అక్టోబర్ 30 నాటికి చేరుకున్నట్లు జెన్‌కో సీఈ మంగేశ్‌కుమార్ తెలిపారు. లక్ష్యాన్ని చేరుకోవడంపై ఉద్యోగులతో కలిసి బుధవారం జలవిద్యుత్ కేంద్రంలో కేక్‌ను కట్ చేసి సంబరాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎడమ కాల్వ ద్వారా పంటలకు నీటిని విడుదల చేస్తూ జనరేషన్ ద్వారా టార్గెట్‌ను చేరుకున్నామన్నారు. కృష్ణా రివర్ బోర్డు నాగార్జునసాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తిని ఆపేయాలని సూచించిందని తెలిపారు.

అత్యవసరమైన విద్యుత్ ఉత్పత్తి చేపడుతామన్నారు. కార్యక్రమంలో డీఈ రాజేశ్, ఈడీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఏఈ లింగారెడ్డి, మణిదీప్, క్రాంతి, భూషణ్, సిబ్బంది పాల్గొన్నారు.



పీఏపల్లిలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్

# హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

**• మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్**

పెద్దఅడిశర్లపల్లి, నవంబర్ 6 : ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. బుధవారం పీఏపల్లి మండలంలోని అంగడిపేట స్టేజీవద్ద ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ మండల కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై పది నెలలైనా ప్రజలకిచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కష్టకాలంలో పార్టీ జెండాను మోసిన కార్యకర్తలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు. కార్యకర్తలు ధైర్యంతో ముందుకు సాగి స్థానిక ఎన్నికలలో సత్తా చాటాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు వల్లపురెడ్డి, నాయకులు ముత్యంరావు, మునగాల అంజిరెడ్డి, బొడ్డుపల్లి మహేందర్, వంగాల కృష్ణారెడ్డి, దామోదర్, రాయినబోయిన శ్రీనువాస్, సుధాకర్, నరేందర్, రవికుమార్, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల జాబితా పరిశీలకుడు అహ్మద్ నదీమ్

# ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించాలి

**• ఎన్నికల జాబితా పరిశీలకుడు అహ్మద్ నదీమ్**

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 6 : ఓటరు జాబితా పారదర్శకంగా రూపొందించాలని ఎన్నికల జాబితా పరిశీలకుడు అహ్మద్ నదీమ్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ హనుమంతరావుతో కలిసి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక ఓటరు జాబితా సవరణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ లెవల్ ఆఫీసర్ల ద్వారా ప్రతి ఇంటినీ సర్వే చేయాలని, ఓటరు జాబితా సవరణ, యాప్ వినియోగంపై బూత్ లెవెల్ ఆఫీసర్లకు పూర్తి స్థాయి అవగాహన ఉండాలని సూచించారు. ఫారమ్ 6, 7, 8 దరఖాస్తులు పెండింగ్ ఉండకుండా చూడాలన్నారు. ఏఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు ప్రతి పోలింగ్ స్టేషన్‌ను నిర్ణీత సమయంలో తనిఖీ చేయాలని ఆదేశించారు. సర్వే సమయంలో ఓటరు వివరాలు, అడ్రస్‌ను సరిగ్గా పరిశీలించాలన్నారు. బూత్ లెవల్ అసిస్టెంట్లను నియమించేలా రాజకీయ పార్టీలకు తెలుపాలని, డ్రాఫ్ట్ ఎలక్టోరల్ జాబితాలను ఆయా పార్టీలకు అందించాలని సూచించారు. కొత్తగా ఏర్పాటు చేసే పోలింగ్ స్టేషన్లను విజిట్ చేసి వివరాలు తెలుపాలన్నారు. 2025 జనవరి ఒకటికి 18 ఏండ్లు నిండే వారిని ముందుగానే గుర్తించి ఓటరుగా నమోదు చేయాలన్నారు. ఈ నెల 9, 10 తేదీల్లో స్పెషల్ క్యాంపెయినింగ్ డే ఉన్నందున ప్రతి ఇంటికి వెళ్లి వివరాలు సేకరించాలన్నారు. భువనగిరి నియోజకవర్గంలో 2,21,589 మంది, ఆలేరులో 2,36,837 మంది ఓటర్లుగా నమోదైనట్లు తెలిపారు.

రెండు నియోజకవర్గాల్లో మహిళా ఓటర్ల శాతం గణనీయంగా పెరిగిందన్నారు. సర్వీస్ ఓటర్లు భువనగిరి నియోజకవర్గంలో 56, ఆలేరు నియోజకవర్గంలో 106 ఉన్నట్లు చెప్పారు. ఓటర్ల తుది జాబితాను జనవరి 6న విడుదల చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్, భువనగిరి ఆర్డీఓ కృష్ణారెడ్డి, తాసీల్దార్లు, ఎలక్షన్ సెల్ సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# నీటి పరీక్ష కిట్టు.. ఉపయోగిస్తే ఒట్టు!

**అధికారుల నిర్లక్ష్యంతో అటకెక్కిన పరికరాలు...ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం**

నేరేడుచర్ల, నవంబర్ 6 : బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు శుద్ధ జలాలు అందించడం కోసం మిషన్ భగీరథ పథకం ప్రవేశపెట్టింది. మంచి నీటి ట్యాంకుల ద్వారా సురక్షిత తాగునీటిని అందించింది. ప్రజలకు సరఫరా చేసే నీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టేందుకు నీటి పరీక్ష కిట్లు అందజేసింది. దీనికి సంబంధించి గ్రామీణ నీటి సరఫరా శాఖ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చింది. కానీ పంచాయతీల అధికారుల నిర్లక్ష్యం కారణంగా మంచి నీటి ట్యాంకులోని నీటిని పరీక్షించే కిట్లు అటకెక్కాయి.




నీటి పరీక్ష కిట్టు

### బ్లీచింగ్ పౌడర్ చల్లి వదిలేస్తున్నారు..

గ్రామాల్లో ఏఎన్ఎంలు, పంచాయతీ సిబ్బంది కలిసి తరచూ నీటి పరీక్షలు చేసి, సాంద్రతను బట్టి తగిన చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. విధిగా ఆయా పంచాయతీలు పరీక్ష చేసి తగిన మోతాదులో కలిపిన మిశ్రమాల వివరాలను రికార్డుల్లో పొందుపరిస్తే తదుపరి చర్యలకు దోహదపడుతుంది. కానీ క్షేత్రస్థాయిలో అలా జరుగకపోగా పంచాయతీ కార్యాలయాల్లో ఆ కిట్లు కనిపించడం లేదు. ఆరోగ్య సిబ్బంది కూడా దృష్టి సారించిన దాఖలాలు లేవు. దాంతో పంచాయతీ కార్మికులు తమకు తోచినప్పుడల్లా బ్లీచింగ్ పౌడర్ చల్లి చేతులు దులుపుకుంటున్నారని ప్రజలు బహిరంగంగా విమర్శిస్తున్నారు. అయినప్పటికీ అధికారులు పట్టించుకునే పరిస్థితి లేదు.

### వ్యాధులు ప్రబలే ప్రమాదం..

మంచి నీటి ట్యాంకులను శుభ్రం చేయకుండా పంచాయతీ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈ కారణంగా నీరు కలుషితమై అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని చింతలపాలెంలో కలుషిత నీరు కారణంగా ఇటీవల చాలామంది అనారోగ్యానికి గురయ్యారు.


దాంతో గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నారు. ఇంతటి ప్రమాదం పొంచి ఉన్నప్పటికీ గ్రామ ప్రత్యేకాధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు దృష్టి సారించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రజారోగ్యంపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.



మిర్యాలగూడ ట్రెజరీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఆల్ పెన్షనర్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నాయకులు

# సమస్యలు పరిష్కరించాలని పెన్షనర్ల ధర్నా

నకిరేకల్/మిర్యాలగూడ టౌన్, నవంబర్ 6 : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధర్యంలో బుధవారం నకిరేకల్, మిర్యాలగూడ డివిజన్ ట్రెజరీ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిస్వాల్ కమిషన్ సిఫార్సు మేరకు కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తున్న మాదిరిగా 20 సంవత్సరాల సర్వీస్‌కు పూర్తి పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏ, డీఆర్‌ను వెంటనే ప్రకటించి అమలు చేయాలని, ఏరియర్స్ ఒకే దఫా చెల్లించాలని కోరారు. ఎంప్లాయీస్ హెల్త్‌స్కీం కింద అన్ని కార్పొరేట్ వైద్యశాలల్లో నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను ఎస్‌టీఓ, తాసీలార్దర్లకు అందించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు నూకల జగదీశ్, నకిరేకల్ డివిజన్ అధ్యక్షుడు సీహెచ్. అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పట్టేటి కృష్ణయ్య, జిల్లా కార్యదర్శి వై. కృష్ణారెడ్డి, సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. ప్రకాశ్‌రావు, నాయకులు కె.మల్లయ్య, బి.లింగారెడ్డి, సత్యనారాయణ, రమణారెడ్డి, మాధవరెడ్డి పాల్గొన్నారు.



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులు

# డబుల్ బెడ్రూం ఇండ్లను అప్పగించాలి

**• ఆర్డీఓకు లబ్ధిదారుల వినతి**

కోదాడ, అక్టోబరు 6 : బీఆర్ఎస్ ప్రభుత్వం బాలాజీనగర్‌లో ఎంపిక చేసిన 560 డబుల్ బెడ్రూమ్ ఇండ్లను తక్షణమే లబ్ధిదారులకు అప్పగించాలని బీఆర్ఎస్ జిల్లా యువజన నాయకులు బెజవాడ శ్రవణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లబ్ధిదారులతో కలిసి బుధవారం కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రవణ్ మాట్లాడుతూ మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామనే నెపంతో లబ్ధిదారులకు ఇండ్లను అప్పగించకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. 560 మంది లబ్ధిదారులు కిరాయి ఇండ్లలో జీవిస్తున్నారని, వెంటనే డబుల్ బెడ్రూం ఇండ్లను ఇవ్వాలని ఆర్డీఓను కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శిరీషతో పాటు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# నేడు రేపు తాగునీటి సరఫరాలో అంతరాయం

సూర్యాపేట టౌన్, నవంబర్ 6 : సూర్యాపేట పట్టణంలో గురు, శుక్రవారం రెండు రోజుల పాటు మంచినీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణానికి తాగునీరు అందించే మిషన్ భగీరథ మెయిన్ పైప్‌లైన్ చెడిపోవడంతో మరమ్మతులు చేస్తున్నారని, ఈ నెల 7, 8 తేదీల్లో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

# నేడు కోదాడలో చెస్ పోటీలు

కోదాడ రూరల్, నవంబర్ 6 : ఉమ్మడి నల్లగొండ జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్- 14, 17 బాల, బాలికల చదరంగం పోటీలు గురువారం కోదాడ పట్టణ పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు బుధవారం ఎస్‌జీఎఫ్ సూర్యాపేట జిల్లా కార్యదర్శి ఎండీ ఆజాంబాబా తెలిపారు. పోటీల్లో పాల్గొనే బాల, బాలికలు తమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధ్రువీకరించిన బోనఫైడ్, ఆధార్‌కార్డులతో ఉదయం 9 గంటలకు హాజరు కావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం 9491329171, 9912781347 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.



సబ్‌స్టేషన్‌కు తాళం వేస్తున్న గ్రామస్తులు

# సబ్ స్టేషన్‌కు తాళం వేసి నిరసన

మాడ్గులపల్లి, అక్టోబర్ 6: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ నుంచి తడకమళ్ల గ్రామానికి హైఓల్టేజీ విద్యుత్ సరఫరా కావడంతో తమ ఇండ్లల్లోని గృహోపకరణాలు కాలిపోయాయని తడకమళ్ల గ్రామస్తులు బుధవారం సబ్‌స్టేషన్‌కు తాళం వేసి నిరసన తెలిపారు. అధిక లోడ్ వల్ల తమ ఇండ్లల్లోని టీవీలు, ఫ్రిజ్‌లు, ఫ్యాన్లు కాలిపోయాయని, విషయాన్ని విద్యుత్ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. విద్యుత్ అధికారులు వారితో మాట్లాడి మరోసారి సమస్య రాకుండా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.